ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక



**రిపోర్టర్లు కావలెను**

అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం
తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా
జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా
రిపోర్టర్లు కావలెను.

ప్రభాత ఉదయం తెలుగు దినపత్రిక

సంప్రదించండి
ఫోన్: 93910 89608



సంపుటి: 3 | సంచిక: 326 | పేజీలు: 6 | వెల: రూ.3/- | శుక్రవారం 6 మార్చి 2026 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి


# కాంగ్రెస్ విధ్వంస పాలన

## మూసీ పేరుతో కాంగ్రెస్ దోపిడీ.. మురుగు శుద్ధి కేంద్రాలపై అశ్రద్ధ

## నాగోల్ సమీపంలో మూసీని పరిశీలించిన కెటిఆర్ బృందం

**హైదరాబాద్, మార్చి 5 (ప్రభాత ఉదయం)**



మూసీ పేరుతో దోచుకోవడానికే కాంగ్రెస్ ప్రభుత్వం కుటిల ప్రయత్నాలు చేస్తున్నదని సీఎం రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫైర్ అయ్యారు. బీఆర్ఎస్ పాలనలో వికాసం, కాంగ్రెస్ పాలనలో విధ్వంసం కొనసాగుతున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక్క ఇటుకను పేర్చనోడికి కూల్చే హక్కులేదని మండిపడ్డారు. నాగోల్ మూసీ పరీవాహక ప్రాంతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన సుందరీకరణ పనులను గురువారం బీఆర్ఎస్ నేతలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..నాడు మూసీలోని మురుగు నీరుని శుద్ధి చేయాలని బీఆర్ఎస్ ముందుకెళ్లింది. దేశంలోనే అతిపెద్దది అయిన నాగోల్ ఎస్టీపీని రూ. 4వేలకోట్లతో అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించాం. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఇండ్లు కూల్చకుండా, భూములు కోల్పోకుండా మూసీని అభివృద్ధి చేశామన్నారు. 2023 డిసెంబర్ వరకు 85 శాతం ఎస్టీపీ నిర్మాణం పూర్తయింది. 15 బ్రిడ్జీలు కేసీఆర్ ప్రభుత్వం మంజూరు చేసింది. మిగతా పెండింగ్ పనులను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. బంగారుపల్లెంలో పెట్టి కేసీఆర్ తెలంగాణను అప్పగించారు. కాంగ్రెస్ స్వార్థం కోసం రూ. 16 వేల కోట్ల అయ్యే ప్రాజెక్ట్ వ్యయం పది రెట్లు పెంచి 1.50లక్షల కోట్ల భారీ స్కాంకు తెరతీశారని ఆరోపించారు. హైడ్రా పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం అరాచకం సృష్టిస్తున్నది. రేవంత్ రెడ్డి అన్న తిరుపతి రెడ్డి ఇల్లు ఎఫ్‌టీఎల్ జోన్‌లో ఉంది అది కూలగొట్టే దమ్ము ఉందా అని ప్రశ్నించారు. ప్రజలను రోడ్డున పడేసి ఏం సాధిస్తారన్నారు. సీఎం రేవంత్, మంత్రులు ఇలా అందరి ఇళ్లు బఫర్ జోన్‌లో ఉన్నాయి. మహబూబ్‌నగర్‌లో దివ్యాంగులు ఇళ్లు కూల్చారు. ఖమ్మంలో పేదల గుడిసెలను

..మిగతా 2లో



రాజ్యసభ అభ్యర్థులుగా నామినేషన్ వేసిన

## అభిషేక్ సింఘ్వీ, వేం నరేందర్‌రెడ్డి

**హైదరాబాద్, మార్చి 5 (ప్రభాత ఉదయం)**

కాంగ్రెస్ పార్టీ తరఫున తెలంగాణ నుంచి రాజ్యసభ అభ్యర్థులుగా అభిషేక్ మను సింఘ్వీ, వేం నరేందర్‌రెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. ఎన్నికల అధికారి ఉపేందర్‌రెడ్డికి నామినేషన్ పత్రాలు అందజేశారు. దీనికి సీఎం రేవంత్‌తో పాలు పలువురు మంత్రులు హాజరయ్యారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు పెద్ద ఎత్తున అసెంబ్లీ ప్రాంగణానికి చేరుకున్నారు. తెలంగాణ తరఫున రాజ్యసభకు రెండోసారి వెళ్లడం అదృష్టంగా భావిస్తున్నట్లు అభిషేక్ సింఘ్వీ తెలిపారు. కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే, అగ్రనేతలు సోనియా, రాహుల్, కేసీ వేణుగోపాల్‌కు ఆయన ధన్యవాదాలు తెలిపారు. రాజ్యసభ అభ్యర్థిగా అవకాశం కల్పించిన అధిష్ఠానానికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు వేం నరేందర్‌రెడ్డి చెప్పారు. స్తుతం సిటింగ్ ఎంపీగా ఉన్న అభిషేక్ మను సింఘ్వీ పేరును కాంగ్రెస్ ఎంపిక చేయగా ఆయన బుధవారం సాయంత్రమే హైదరాబాద్ వచ్చారు. రెండో స్థానానికి అభ్యర్థి ఎవరనే దానిపై రాత్రి వరకు చర్చలు, సంప్రదింపుల తర్వాత వేం నరేందర్‌రెడ్డి పేరును ఖరారు చేశారు. ఈయనకు రాజ్యసభ అభ్యర్థిత్వం ఖరారు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గట్టిగా కోరడం, అందరితో సన్నిహిత సంబంధాలుండే నరేందర్‌రెడ్డి పేరుపై ఎవరి నుంచీ అభ్యంతరాలు వ్యక్తం కాకపోవడంతో అధిష్ఠానం కూడా చివరకు సీఎం మాటకే ప్రాధాన్యం ఇచ్చింది. ఒకవేళ బీఆర్ఎస్ తన అభ్యర్థిని రంగంలోకి దింపితే రెండో స్థానానికి పోటీ అనివార్యమవుతుంది. ఆ పార్టీ పోటీలో లేకుంటే రెండు స్థానాలను కాంగ్రెస్ ఏకగ్రీవంగా దక్కించుకుంటుంది. మొదటి స్థానానికి అభిషేక్ సింఘ్వీ ఎన్నికకు ఎలాంటి సమస్య లేదు. రెండో స్థానానికి అవసరమైన మెజార్టీ కాంగ్రెస్‌కు లేదు. ఎంఐఎంపై ఆధారపడాల్సి ఉంటుంది. పోటీ లేకుంటే ఎన్నిక ఏకగ్రీవమవుతుంది.



టి20 ప్రపంచకప్ ..

## ఫైనల్‌కు చేరుకున్న భారత్

ఉత్కంఠ పోరులో ఇంగ్లాండ్‌పై విజయం..
ఫైనల్‌కు టీమ్‌ఇండియా

2



తెలంగాణ గవర్నర్‌గా

## శివప్రసాద్ శుక్ల

# గోదావరి పుష్కరాల కోసం కేబినెట్ సబ్ కమిటీ



### గోదావరి పుష్కరాల నిర్వహణపై 9 మందితో కూడిన కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు
### కమిటీ చైర్మన్‌గా మంత్రి శ్రీధర్ బాబు.. కన్వీనర్‌గా దేవాదాయశాఖ ముఖ్య కార్యదర్శి
### 2027 జూలై 23 నుంచి ప్రారంభం కానున్న గోదావరి పుష్కరాలు
### ప్రధాన ఆలయాలు, ఘాట్ల వద్ద శాశ్వత ఏర్పాట్లు చేయాలని సీఎం రేవంత్ ఆదేశం

**హైదరాబాద్, మార్చి 5 (ప్రభాత ఉదయం)**

తెలంగాణలో ప్రతిష్ఠాత్మకంగా జరగనున్న గోదావరి పుష్కరాలకు (2027) ప్రభుత్వం ముందస్తు ఏర్పాట్లు ప్రారంభించింది. 'దక్షిణ కుంభమేళా'గా పిలిచే ఈ మహా క్రతువు నిర్వహణ, ఏర్పాట్ల పర్యవేక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం తొమ్మిది మంది సభ్యులతో కూడిన కేబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కమిటీకి ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు చైర్మన్‌గా వ్యవహరిస్తారు.

కమిటీ సభ్యులుగా మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ,

..మిగతా 2లో

# యుద్ధంతో సమస్యలు పరిష్కారం కావు: మోదీ

### ఫిన్లాండ్ అధ్యక్షుడు అలెగ్జాండర్ స్టబ్‌తో ప్రధాని మోదీ ద్వైపాక్షిక చర్చలు
### చర్చలు, దౌత్యంతోనే సమస్యలకు పరిష్కారం అని ఉద్ఘాటన
### ఉగ్రవాద నిర్మూలనే ఇరువురి ఉమ్మడి లక్ష్యం అని ప్రకటన
### వలసలు, మొబిలిటీపై భారత్, ఫిన్లాండ్ కీలక ఒప్పందం
### విద్యా రంగంలో పరస్పర సహకారానికి నిర్ణయం

**న్యూఢిల్లీ, మార్చి 5 (ప్రభాత ఉదయం)**

ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో భారత్ మరోసారి శాంతి మంత్రం జపించింది. కేవలం సైనిక చర్యలతో ఏ సమస్యా పరిష్కారం కాదని, చర్చలు, దౌత్యమే సరైన మార్గమని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. గురువారం నాడు ఢిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో ఫిన్లాండ్ అధ్యక్షుడు అలెగ్జాండర్ స్టబ్‌తో ప్రధాని మోదీ ద్వైపాక్షిక చర్చలు జరిపారు. అనంతరం ఇరువురు నేతలు సంయుక్తంగా మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా పశ్చిమాసియా, ఉక్రెయిన్‌లలో నెలకొన్న ఘర్షణలను ముగించేందుకు జరిగే ప్రతి ప్రయత్నానికి భారత్ మద్దతు ఇస్తుందని మోదీ హామీ ఇచ్చారు. చట్టం, న్యాయం, ప్రజాస్వామ్య విలువలపై భారత్, ఫిన్లాండ్‌లకు ఒకే రకమైన అభిప్రాయం ఉందని


..మిగతా 2లో



దిగుమతుల సుంకాలను

# తిరిగి చెల్లించాల్సిందే

### ట్రంప్‌కు మరో ఎదురుదెబ్బ
### దిగుమతుల సుంకాలను తిరిగి చెల్లించాల్సిందే
### అమెరికన్ ట్రేడ్ కోర్టు తీర్పు



**వాషింగ్టన్, మార్చి5 (ప్రభాత ఉదయం)**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు మరో ఎదురుదెబ్బ తగిలింది. దిగుమతులపై విధించిన సుంకాలను తిరిగి చెల్లించాల్సిందేనని ట్రేడ్ కోర్టు తీర్పు ఇచ్చింది. ఇటీవల 1977 అంతర్జాతీయ అత్యవసర ఆర్థిక అధికారాల చట్టం కింద ట్రంప్ విధించిన భారీ టారిఫ్‌లను సుప్రీం కోర్టు రద్దు చేసింది. ఇకపై ఈ టారిఫ్‌ల వసూళ్లు నిలిపివేయాలని కోర్టు అధికారులకు ఆదేశించింది. అయితే,

..మిగతా 2లో



# రాజ్యసభకు నితీశ్ కుమార్

### బీహార్‌తో అనుబంధం కొనసాగుతుందని వెల్లడి
### బిజెపికి దక్కనున్న కొత్త ముఖ్యమంత్రి పదవి

**పాట్నా, మార్చి5 (ప్రభాత ఉదయం)**

జేడీయూ అధ్యక్షుడు, బిహార్ ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్ రాజ్యసభకు వెళ్లనున్నట్టు ప్రకటించారు. ఈ విషయాన్ని ఆయనే స్వయంగా 'ఎక్స్' వేదికగా ధృవీకరించారు. దీంతో ఆయన త్వరలోనే ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయనున్నట్టు సంకేతాలు వస్తున్నాయి. ఇప్పటివరకు తాను మూడు సభల్లో సభ్యుడిగా ఉన్నానని, రాజ్యసభ సభ్యుడిగానూ సేవలందించి 'నాలుగు సభల క్లబ్'లో చేరాలని కోరుకుంటున్నట్టు తెలిపారు. 'రెండు దశాబ్దాలుగా మీరు నన్ను నమ్మి ఎంతో మద్దతిచ్చారు. అంకితభావంతో నా నేను విధుల్ని నిర్వర్తించాను. మీ మద్దతు, నమ్మకం వల్లే బిహార్ అభివృద్ధిలో కొత్త ప్రమాణాలను నెలకొల్పుతోంది. నా పార్లమెంటరీ జీవితం ప్రారంభించినప్పటి నుంచి నా మనసులో ఓ కోరిక ఉంది. రాష్ట్ర స్థాయిలో రెండు చట్టసభలతో పాటు పార్లమెంట్‌లోని

..మిగతా 2లో

# గోదావరి పుష్కరాల కోసం కేబినెట్ సబ్ కమిటీ

**మొదటి పేజీ తరువాయి...**

సీతక్క, తుమ్మల నాగేశ్వరరావు, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్, పి.సుదర్శన్ రెడ్డిలను నియమించారు. దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి ఈ కమిటీకి కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. అవసరాన్ని బట్టి గోదావరి తీర ప్రాంతాల ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను ప్రత్యేక ఆహ్వానితులుగా సమావేశాలకు పిలవనున్నారు. త్వరలోనే కమిటీ సమావేశమై సిఫార్సులను అందజేయనుంది.

2027 జూలై 23న గోదావరి పుష్కరాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటికే అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈసారి వచ్చే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని కేంద్రం నుంచి ప్రత్యేక



ప్యాకేజీ కోరాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రంలో సుమారు 560 కిలోమీటర్ల మేర గోదావరి ప్రవహిస్తుండటంతో దాదాపు 74 ఘాట్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు ఉన్నాయి. ముఖ్యంగా బాసర, కాళేశ్వరం, ధర్మపురి, భద్రాచలం ఆలయాల వద్ద రద్దీ ఎక్కువగా ఉండే అవకాశం ఉండటంతో అక్కడ ప్రాధాన్యత ఇవ్వాలని సీఎం సూచించారు. పుష్కరాల ఏర్పాట్లు తాత్కాలికంగా కాకుండా, శాశ్వత ప్రాతిపదికన ఉండాలని సీఎం స్పష్టం చేశారు. ఆలయాల అభివృద్ధి, పర్మనెంట్ పుష్కర ఘాట్లు, రోడ్లు, వసతి సముదాయాలు నిర్మించాలని ఆదేశించారు. రోజుకు రెండు లక్షల మంది భక్తులు వచ్చినా ఇబ్బంది లేకుండా ట్రాఫిక్, పార్కింగ్, మంచినీటి సౌకర్యాలు కల్పించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

# యుద్ధంతో సమస్యలు పరిష్కారం కావు: మోదీ

**మొదటి పేజీ తరువాయి...**

ఆయన తెలిపారు. ప్రస్తుతం ప్రపంచం ఎదుర్కొంటున్న సవాళ్లను పరిష్కరించడానికి అంతర్జాతీయ సంస్థల్లో సంస్కరణలు అత్యవసరమని ఇరువురు నేతలు ఏకాభిప్రాయానికి వచ్చారు. ఉగ్రవాదాన్ని అన్ని రూపాల్లోనూ నిర్మూలించడమే తమ ఉమ్మడి లక్ష్యమని మోదీ పేర్కొన్నారు. ఫిన్లాండ్ అధ్యక్షుడు అలెగ్జాండర్ స్టబ్ 'ఐరన్‌మ్యాన్ ట్రయాథ్లాన్' పూర్తి చేయడాన్ని ప్రస్తావిస్తూ మోదీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "మీరు ఐరన్‌మ్యాన్ ట్రయాథ్లాన్ పూర్తి చేశారు.. మీలాంటి శక్తివంతమైన నాయకత్వంతో భారత్, ఫిన్లాండ్ కూడా ఇన్నోవేషన్, డిజిటల్, సస్టైనబిలిటీ అనే కొత్త 'ట్రయాథ్లాన్'ను సాధిస్తాయని నాకు నమ్మకం ఉంది" అని మోదీ చమత్కరించారు.

**కొత్త శకంలో భారత్-యూరప్ బంధం**

ప్రస్తుతం ప్రపంచం అస్థిరత, అనిశ్చితి మధ్య ఉందని, ఉక్రెయిన్ నుంచి పశ్చిమాసియా వరకు అనేక ప్రాంతాల్లో ఘర్షణలు కొనసాగుతున్నాయని మోదీ ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రపంచంలోని రెండు పెద్ద దౌత్య శక్తులైన భారత్, యూరప్ మధ్య సంబంధాలు స్వర్ణయుగంలోకి ప్రవేశిస్తున్నాయని ఆయన అభివర్ణించారు. 2026 ప్రారంభంలో కుదిరిన చారిత్రాత్మక 'ఇండియా-యూరోపియన్ యూనియన్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం' గురించి ప్రధాని ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఈ ఒప్పందం ద్వారా భారత్, ఫిన్లాండ్ మధ్య వాణిజ్యం,



పెట్టుబడులు, సాంకేతిక సహకారం మరింత బలపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

**కీలక ఒప్పందాలపై సంతకాలు**

ఇరు దేశాల మధ్య ఆవిష్కరణల వ్యవస్థను అనుసంధానించేందుకు సమగ్ర 'మైగ్రేషన్ అండ్ మొబిలిటీ' (వలసలు మరియు రాకపోకల) ఒప్పందంపై సంతకాలు చేసినట్లు ప్రధాని ప్రకటించారు. భారతీయ విద్యార్థులకు, ప్రతిభావంతులకు ఫిన్లాండ్ ఇప్పుడు ఒక ప్రాధాన్య గమ్యస్థానంగా మారుతోందన్నారు. ఈ ఒప్పందం వల్ల ఇరు దేశాల మధ్య పరిశోధనలు, స్టార్టప్ సహకారం మరింత బలపడుతుందని తెలిపారు. విద్యా రంగంలో ఫిన్లాండ్ ప్రపంచానికే ఆదర్శంగా నిలుస్తోందని కొనియాడిన మోదీ.. ఉపాధ్యాయ శిక్షణ, స్కూల్-టు-స్కూల్ భాగస్వామ్యం, భవిష్యత్ విద్యా విధానాలపై సహకారాన్ని విస్తరించుకోవడానికి అంగీకరించినట్లు వెల్లడించారు. నార్డిక్ ప్రాంతంలో ఫిన్లాండ్ భారత్‌కు ముఖ్యమైన భాగస్వామి అని, ఆర్కిటిక్, ధృవ ప్రాంతాల పరిశోధనల్లోనూ తమ సహకారం కొనసాగుతుందని మోదీ స్పష్టం చేశారు.

# టి20 ప్రపంచకప్.. ఫైనల్‌కు చేరుకున్న భారత్

## ఉత్కంఠ పోరులో ఇంగ్లాండ్‌పై విజయం.. ఫైనల్‌కు టీమ్‌ఇండియా

- ముంబై వేదికగా ఇంగ్లండ్ తో జరిగిన సెమీఫైనల్లో భారత్ విజయం
- మొదట బ్యాటింగ్ చేసి 253 పరుగుల భారీ స్కోరు సాధించిన టీమిండియా
- భారత్ తరపున సంజు శాంసన్, ఇంగ్లండ్ తరపున బెతెల్ మెరుపు ఇన్నింగ్స్
- ఆఖరి ఓవర్లో ఉత్కంఠ నడుమ 7 పరుగుల తేడాతో ఇంగ్లండ్ ఓటమి






ముంబైలోని వాంఖడే స్టేడియం వేదికగా జరిగిన ఐసీసీ పురుషుల టీ20 వరల్డ్ కప్ 2026 రెండో సెమీఫైనల్లో పరుగుల వరద పారింది. ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగిన ఈ హైస్కోరింగ్ సమరంలో ఇంగ్లండ్ పై భారత్ 7 పరుగుల తేడాతో విజయం సాధించి ఫైనల్ లోకి ప్రవేశించింది. ఇంగ్లండ్ బ్యాటర్ జాకబ్ బెతెల్ (105) వీరోచిత సెంచరీతో పోరాడినప్పటికీ, ఆఖరి ఓవర్లో రనౌట్ రూపంలో వెనుతిరగడంతో ఇంగ్లండ్ ఆశలు ఆవిరయ్యాయి.

254 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన ఇంగ్లండ్ కు ఆరంభంలోనే ఎదురుదెబ్బ తగిలింది. ఓపెనర్ ఫిల్ సాల్ట్ (5), కెప్టెన్ బట్లర్ (25), హ్యారీ బ్రూక్ (7) త్వరగానే పెవిలియన్ చేరారు. ఈ దశలో జాకబ్ బెతెల్ ఒంటరి పోరాటం చేశాడు. భారత బౌలర్లపై విరుచుకుపడుతూ కేవలం 48 బంతుల్లో 8 ఫోర్లు, 7 సిక్సర్లతో 105 పరుగులు చేసి మ్యాచ్ ను మలుపు తిప్పాడు. అతనికి విల్ జాక్స్ (35) చక్కటి సహకారం అందించాడు. వీరిద్దరి దూకుడుతో ఒకానొక దశలో ఇంగ్లండ్ గెలిచేలా కనిపించింది.

అయితే ఆఖరి ఓవర్లో ఇంగ్లండ్ విజయానికి 30 పరుగులు అవసరం కాగా, శివమ్ దూబె బౌలింగ్ కు దిగాడు. మొదటి బంతికే డేంజర్ మ్యాన్ బెతెల్ రనౌట్ కావడంతో మ్యాచ్ భారత్ వైపు తిరిగింది. జోఫ్రా ఆర్చర్ చివర్లో వరుసగా మూడు సిక్సర్లు బాదినప్పటికీ, అప్పటికే ఆలస్యం కావడంతో ఇంగ్లండ్ 246 పరుగులకే పరిమితమైంది. మొత్తమ్మీద ఇంగ్లండ్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లకు 246 పరుగులు చేసింది. భారత బౌలర్లలో హార్దిక్ పాండ్యా 2 వికెట్లు తీయగా, బుమ్రా, అర్ష్‌దీప్, అక్షర్, వరుణ్ తలో వికెట్ పడగొట్టారు.

అంతకుముందు, టాస్ గెలిచిన ఇంగ్లండ్ బౌలింగ్ ఎంచుకోగా, భారత బ్యాటర్లు ఆకాశమే హద్దుగా చెలరేగారు. ఓపెనర్ సంజు శాంసన్ ఇంగ్లండ్ బౌలర్లకు చుక్కలు చూపించాడు. కేవలం 42 బంతుల్లోనే 8 ఫోర్లు, 7 సిక్సర్లతో 89 పరుగులు చేసి ఇన్నింగ్స్ కు గట్టి పునాది వేశాడు. మరోవైపు ఇషాన్ కిషన్ (39), శివమ్ దూబె (43) దూకుడుగా ఆడగా, చివర్లో తిలక్ వర్మ (7 బంతుల్లో 21), హార్దిక్ పాండ్యా (27) మెరుపులతో భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 253 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఇంగ్లండ్ బౌలర్లలో ఆర్చర్ 61 పరుగులు సమర్పించుకోగా, జాక్స్, రషీద్ చెరో రెండు వికెట్లు తీశారు.

ఈ విజయంతో భారత్ టైటిల్ పోరుకు సిద్ధమైంది. టీ20 ప్రపంచకప్ లో టీమిండియా వరుసగా రెండోసారి ఫైనల్ చేరింది. 2024లో టీమిండియా ఛాంపియన్ గా నిలవడం తెలిసిందే.

ఇక, టీ20 వరల్డ్ కప్ ఫైనల్ మ్యాచ్ లో టీమిండియా.... న్యూజిలాండ్ తో అమీతుమీ తేల్చుకోనుంది. ఈ టైటిల్ సమరం మార్చి 8న అహ్మదాబాద్ లో జరగనుంది.



# కాంగ్రెస్ విధ్వంస పాలన

**మొదటి పేజీ తరువాయి...**

బుల్డోజర్లతో నేలమట్టం చేశారు. ఇవన్నీ రాహుల్ గాంధీకి కనిపించడం లేదా అని ప్రశ్నించారు. మూసీ పరివాహక ప్రాంత ప్రజలను బయపెట్టే ప్రయత్నం చేస్తున్నారు. రేవంత్‌కు రూ.16 వేల కోట్లతో మూసీని సుందరీకరించడం చేతకాకపోతే మేము చేసి చూపిస్తామని సవాల్ విసిరారు. రాష్ట్రంలో హైడ్రా పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అరాచకాలకు హద్దే లేదని కేటీఆర్ విమర్శించారు. పేదల ఇళ్లు కూల్చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రూ.1.50 లక్షల కోట్లతో మూసీ సుందరీకరణ పనులు చేస్తామని సీఎం రేవంత్ చెబుతున్నారు. రూ.16వేల కోట్లతోనే ఆ పనులను చేయొచ్చు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలు గెలిపించింది హామీల అమలు కోసమేనని గుర్తు చేశారు. రెండున్నరేళ్లలో ఒక్క ఇల్లు నిర్మించినట్లు చూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకొంటా. మూసీ సుందరీకరణ పనుల బాధ్యత మాకు అప్పగిస్తే రూ.16వేల కోట్లకే చేసి చూపిస్తాం. ఒక్క ఇల్లు కూడా కూల్చకుండా అభివృద్ధి చేస్తాం అని కేటీఆర్ అన్నారు. కెటిఆర్ వెంట మాజీమంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఎల్‌బి నగర్ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ సురభి వాణీదేవి తదితరులు ఉన్నారు.

# రాజ్యసభకు నితీశ్ కుమార్

**మొదటి పేజీ తరువాయి...**

ఉభయ సభలకు ప్రాతినిధ్యం వహించాలనుకున్నాను. అందుకే త్వరలో జరగనున్న ఎన్నికల్లో రాజ్యసభ సభ్యుడిగా నా ప్రయాణాన్ని ప్రారంభించాలి అనుకుంటున్నాను. నూతన బాధ్యతలు చేపట్టాక కూడా బిహార్‌తో నా బంధం ఇలాగే కొనసాగుతుందని హామీ ఇస్తున్నాను. కొత్త ప్రభుత్వానికి నా పూర్తి మద్దతు అందిస్తాను' అని నితీశ్ కుమార ఎక్స్‌లో రాసుకొచ్చారు . నితీశ్ తాజా ప్రకటనతో.. బిహార్‌కు నూతన ముఖ్యమంత్రి ఎన్నిక అనివార్యం కానుంది. ఈ నేపథ్యంలో బీజేపీ నేతకే సీఎం పదవీ బాధ్యతలు దక్కవచ్చని విశ్వసనీయ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ నేపథ్యంలో పలువురు బీజేపీ ఆశావహులు సీఎం కుర్చీ కోసం పోటీపడుతున్నారు. ఆ జాబితాలో ఉప ముఖ్యమంత్రులు సామ్రాట్ చౌదరి, విజయ్ కుమార్ సిన్హా, రాష్ట్ర మంత్రి దిలీప్ జాయస్వాల్, దిఘా ఎమ్మెల్యే సంజీవ్ చౌరాసియా వంటి వారి పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్ కూడా సీఎం రేసులో ఉన్నట్టు తెలుస్తోంది. బిహార్‌లో గతేడాది నవంబర్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగ్గా.. బీజేపీ, జేడీయూ కూటమి తరఫున నితీశ్ కుమార్ రికార్డ్ స్థాయిలో పదోసారి ముఖ్యమంత్రి పీఠాన్ని అధిష్ఠించారు. అయితే.. దేశ వ్యాప్తంగా 37 రాజ్యసభ స్థానాలకు మార్చి 16న ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో రాజ్యసభకు వెళ్లేందుకు ఆయన నామినేషన్ వేయనున్నట్లు సమాచారం.

# దిగుమతుల సుంకాలను తిరిగి చెల్లించాల్సిందే

**మొదటి పేజీ తరువాయి...**

ఇప్పటికే వసూలు చేసిన సుంకాలను తిరిగి ఇవ్వాలా లేదా అన్న అంశంపై స్పష్టత ఇవ్వలేదు. తాజాగా ట్రేడ్ కోర్టు తీర్పుతో ఆ విషయంపై స్పష్టత వచ్చింది. అట్మస్ ఫిల్ట్రేషన్ అనే సంస్థ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయమూర్తి రిచర్డ్ ఈటన్, ఈ సుంకాలు చెల్లించిన దిగుమతిదారులు రీఫండ్ పొందేందుకు అర్హులని పేర్కొన్నారు. అలాగే టారిఫ్‌ల రీఫండ్‌కు సంబంధించిన కేసులను తానే పర్యవేక్షిస్తానని తెలిపారు. అమెరికాలోకి దిగుమతయ్యే వస్తువులపై విధించిన సుంకాలు సాధారణంగా 'లిక్విడేషన్' అనే పక్రియ ద్వారా ఖరారు అవుతాయి. ఈ పక్రియలో కస్టమ్స్ అధికారులు నిర్ణయించిన సుంకాలపై దిగుమతిదారులు అభ్యంతరం వ్యక్తం చేయడానికి 180 రోజుల గడువు ఉంటుంది. ఆ గడువు దాటితే నిర్ణయించిన మొత్తాన్ని చెల్లించాల్సిందే. ఇప్పటికే లిక్విడేషన్ పక్రియ పూర్తయిన దిగుమతుల విషయంలో కూడా టారిఫ్‌లు లేకుండా కొత్తగా లెక్కలు చేయాలని సూచించింది. ఇదిలా ఉండగా, ప్రపంచ దేశాలపై సుమారు 15 శాతం వరకు కొత్త సుంకాలను విధించే ప్రతిపాదన ఈ వారం అమల్లోకి రావొచ్చని అమెరికా ఆర్థిక శాఖ కార్యదర్శి స్కాట్ బెసెంట్ తెలిపారు.

## తెలంగాణ గవర్నర్‌గా

# శివప్రసాద్ శుక్ల

## పలు రాష్ట్రాల్లో గవర్నర్లను నియమించిన కేంద్రం

**న్యూఢిల్లీ, మార్చి 5 (ప్రభాత ఉదయం)**

దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల గవర్నర్లు, కేంద్రపాలిత ప్రాంతాల లెఫ్టినెంట్ గవర్నర్లను బదిలీ చేస్తూ కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. మార్చి 5న వెలువడిన తాజా ఉత్తర్వుల ప్రకారం.. తెలంగాణతో పాటు మహారాష్ట్ర, తమిళనాడు, పశ్చిమ బెంగాల్, బీహార్ తదితర రాష్ట్రాలకు కొత్త గవర్నర్లను నియమించారు. ముఖ్యంగా తెలంగాణ గవర్నర్ పదవిలో మార్పు చోటుచేసుకుంది. ప్రస్తుతం హిమాచల్ ప్రదేశ్ గవర్నర్‌గా ఉన్న శివ ప్రతాప్ శుక్లాను తెలంగాణ నూతన గవర్నర్‌గా నియమించారు. ఇప్పటివరకు తెలంగాణ గవర్నర్‌గా వ్యవహరించిన జిష్ణు దేవ్ వర్మను మహారాష్ట్ర గవర్నర్‌గా బదిలీ చేశారు.

**ఇతర రాష్ట్రాల గవర్నర్లు, ఎల్జీల బదిలీల వివరాలు ఇలా ఉన్నాయి:**

ఢిల్లీ: లెఫ్టినెంట్ గవర్నర్‌గా ఉన్న వినయ్ కుమార్ సక్సేనాను లడఖ్ ఎల్జీగా పంపగా, ఆయన స్థానంలో ఢిల్లీ కొత్త ఎల్జీగా తరంజిత్ సింగ్ సంధును నియమించారు.

తమిళనాడు: కేరళ గవర్నర్‌గా ఉన్న రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్‌ను తమిళనాడు గవర్నర్‌గా బదిలీ చేశారు.

పశ్చిమ బెంగాల్: తమిళనాడు గవర్నర్‌గా ఉన్న ఆర్.ఎన్. రవిని పశ్చిమ బెంగాల్ గవర్నర్‌గా నియమించారు.

హిమాచల్ ప్రదేశ్: లడఖ్ లెఫ్టినెంట్ గవర్నర్‌గా ఉన్న కవిందర్ గుప్తాను హిమాచల్ ప్రదేశ్ గవర్నర్‌గా నియమించారు.

బీహార్: లెఫ్టినెంట్ జనరల్ (రిటైర్డ్) సయ్యద్ అతా హస్నైన్‌ను బీహార్ గవర్నర్‌గా నియమించారు.

నాగాలాండ్: నంద్ కిశోర్ యాదవ్‌ను నాగాలాండ్ గవర్నర్‌గా నియమించారు.

రాష్ట్రపతి ఆమోదంతో ఈ ఉత్తర్వులు తక్షణం అమల్లోకి వచ్చాయి. పరిపాలనా సౌలభ్యం, వ్యూహాత్మక కారణాల దృష్ట్యా ఈ మార్పులు జరిగినట్లు తెలుస్తోంది. కొత్తగా నియమితులైన గవర్నర్లు త్వరలోనే ఆయా రాష్ట్రాల్లో బాధ్యతలు స్వీకరించనున్నారు.

# ప్రారంభానికి సిద్ధమైన మరో రెండు చెరువులు..



శివరాంపల్లి లో నూతనంగా పునర్నిర్మాణం చేసిన బమ్రుకున్ దౌల చెరువును పరిశీలిస్తున్న హైడ్రా కమిషనర్ ఏ వీ రంగనాథ్



బంరుకున్ దౌల చెరువు ముఖ ద్వారం

## ఈనెల 8న బమ్మకున్ -ఉద్ -దౌలా చెరువు ప్రారంభం..

## సీఎం చేతుల మీదు గా ప్రారంభానికి సన్నాహాలు..

## ఏర్పాట్లను పరిశీలించిన హైడ్రా కమిషనర్

**రాజేంద్రనగర్,మార్చి5(ప్రభాత ఉదయం)**

చారిత్రక బమ్మకున్-ఉద్-దౌలా లేక్ ప్రారంభానికి ముహూర్తం ఖరారైంది.ఈనెల 8వ తేదీ ఆదివారం సాయంత్రం 7.30 గంటలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ చెరువును ప్రారంభించనున్నారు. కూకట్‌పల్లిలోని నల్లచెరువు ప్రారంభోత్సవానికి కూడా ముహూర్తం ఖరారైంది.ఈ నెల 9వ తేదీన నల్లచెరువును ముఖ్యమంత్రి ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ బమ్మకున్-ఉద్-దౌలా చెరువును గురువారం సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు.చెరువు సుందరీకరణ పనులను తిలకించారు.చెరువు కట్టతో పాటు..ఖాళీ ప్రదేశాల్లో నాటిన ఔషధ మొక్కలను పరిశీలించారు.పిల్లలు ఆడుకునే ప్లే ఏరియాలతో పాటు..అన్ని వయసులవారు సేద దీరేందుకు వీలుగా చెరువు కట్టపై ఏర్పాటు చేసిన గజబోలు(గుమ్మటాలు)ను చూశారు.పాతబస్తీ సంప్రదాయాలు ఉట్టి పడేలా ఏర్పాటు చేసిన ప్రధాన ద్వారం,చెరువు చరిత్రను వివరించిన బోర్డులను పరిశీలించారు.చెరువును ప్రారంభించిన తర్వాత జరగనున్న సభ ఏర్పాట్లను కూడా హైడ్రా కమిషనర్ పరిశీలించారు.హైడ్రా అదనపు కమిషనర్ ఆర్ సుదర్శన్,అదనపు సంచాలకులు వర్ల పాపయ్యతో పాటు..పోలీసుశాఖ అధికారులు హైడ్రా కమిషనర్ వెంట ఉన్నారు.సభా ఏర్పాట్లపై సమీక్షించారు.

**పాతబస్తీకి మణిహారం..బమ్మకున్-ఉద్-దౌలా చెరువు..**

పాతబస్తీకి మణిహారం చారిత్రక బమ్మకున్-ఉద్- దౌలా చెరువు పాతబస్తీలో నిజాంల నాటి చారిత్రక చెరువుకు హైడ్రా ప్రాణం పోసింది.కబ్జాలను తొలగించి ఊపిరిలూదింది.ఆక్రమణలతో ఆనవాళ్లే కోల్పోయిన చెరువును బతికించింది.చరిత్రను తవ్వితీసిన మాదిరి చెరువును రూపొందించి చారిత్రక వైభవాన్ని హైడ్రా చాటింది.కాలగర్భంలో కలిసిపోయిందనుకున్న చరిత్రకు ప్రాణం హైడ్రా ప్రాణం పోసింది.ఒకవైపు ఉన్న నాటి కట్టను మరింత పటిష్టం చేసి వాకింగ్ ట్రాక్‌ను హైడ్రా నిర్మించింది.కట్టపై ఓపెన్ జిమ్‌ను పెట్టి అన్ని వయసులవారి ఆరోగ్యానికి బాటలు వేసింది.చెరువు లోపలి వైపు ఫెన్సింగ్ పనులను పూర్తి చేసింది. చిన్నారులు ఆడుకునేందుకు ఇరువైపులా ప్లే ఏరియాలను అభివృద్ధి చేశారు.వృద్ధులు సేద దీరే విధంగా అక్కడ గజబోలు నలువైపులా నిర్మించారు. చెరువుకు మూడు వైపులా ప్రవేశ మార్గాలను అందుబాటులోకి తెచ్చారు.నిజాంల కాలంలో ఈ చెరువుకు ఎంతో చరిత్ర ఉందని..దానిని పునరావృతం చేసేలా..చుట్టూ ఔషధగుణాలున్న మొక్కలతో పాటు..చల్లటి నీడనిచ్చే చెట్లను నాటారు.సీసీటీవీ కెమేరాలను ఏర్పాటు చేసి..హైడ్రా ప్రధాన కార్యాలయం నుంచి పర్యవేక్షించేలా ఏర్పాట్లు చేశారు.

**విహార కేంద్రంగా తీర్చిదిద్దాలి..**

కాంక్రీట్ జంగిల్‌గా నగరాలు మారిపోతున్న వేళ.. పాతబస్తీలో నేషనల్ పోలీస్ అకాడమీకి చేరువలో అభివృద్ధి చేస్తున్న బమ్మకున్-ఉద్-దౌలా చెరువు విహార కేంద్రంగా తీర్చిదిద్దాలని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ గతంలో పలుమార్లు సందర్శించినప్పుడు అధికారులను ఆదేశించారు. ఔషధ గుణాలున్న వృక్ష జాతితో పాటు..మొక్కలను చెరువు చుట్టూ నాటాలని సూచించారు.పచ్చిక బైళ్లతో పార్కులు ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలన్నారు. బయటకు చెరువు పరిసరాల్లో ఉన్న ఉష్ణోగ్రతల్లో తేడా తెలిసేలా..పచ్చని వాతావరణం ఉండేలా చూడాలన్నారు.నిజాంల కాలంలో చెరువు నిర్మాణంలో వాడిన రాతిని వినియోగించి కట్టడాన్ని పటిష్టం చేయాలన్నారు.ఇన్‌లెట్‌లు,ఔట్‌లెట్‌లు విశాలంగా ఉండేలా చూడాలన్నారు. రాజేంద్రనగర్, ఆరాంఘర్ ఇలా 10 కిలోమీటర్ల మేర చెరువుకు వర్షం నీరు వచ్చేలా ఇన్‌లెట్లు నిర్మించాలని..ఈ ప్రాంతంలో వరద కష్టాలకు ఈ చెరువు చెక్‌పెట్టేలా చూడాలని సూచించారు.ఇలా కమిషనర్ ఏవీ రంగనాథ్ మార్గదర్శకంలో చెరువు సిద్ధమైంది.

**చరిత్రను చాటేలా..**

1770లో మూడవ నిజాం సికందర్ జాహ్ పాలనలో అప్పటి ప్రధానమంత్రిగా ఉన్న నవాబ్ రుక్న్-ఉద్- దౌలా ఈ చెరువును నిర్మించారని..


అందుకే బమ్మకున్-ఉద్-దౌలా చెరువు పేరు వచ్చిందని చారిత్రక ఆధారాలు చెబుతున్నాయి. తాగు నీటి అవసరాలను తర్చేలా 104 ఎకరాల మేర ఈ చెరువు విస్తరించి ఉందని చరిత్ర చెబుతోంది. కాలక్రమంలో చెరువు విస్తీర్ణం తగ్గుతూ హెచ్‌ఎండీఏ ఈ చెరువును 17.05 ఎకరాలుగా నిర్ధారించింది. చివరికి 4.12 ఎకరాలుగా మిగిలిపోయింది.హైడ్రా 2024 ఆగస్టులో ఆక్రమణలను తొలగించింది.హెచ్ ఎండీఏ పేర్కొన్న విధంగా పూర్తి స్థాయిలో భూమి అందుబాటులోకి తెచ్చింది.ఆక్రమణలు తొలగిస్తున్నప్పుడు అనేక అవరోధాలను అధిగమించి..విమర్శలను ఎదుర్కొంది.అలా విమర్శించిన వారే ఔరా అనేట్టు హైడ్రా ఈ చెరువును అభివృద్ధి చేసింది.ఇప్పుడు స్థానికులు ఎంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు.కలలో కూడా ఊహించడం కష్టంగా ఉన్న ఈ ప్రాంతానికి ఇంత అందాన్ని తీసుకువచ్చిన హైడ్రాకు అభినందనలు తెలుపుతున్నారు.

**చెరువు చుట్టూ చరిత్ర..**

అడుగడుగునా చారిత్రక ఆనవాళ్లు,ఎన్నో విశేషాలు స్థానికంగా ఉన్న వృద్ధులు పలు విధాలుగా వివరిస్తున్నారు.రాజేంద్రనగర్,ఆరాంఘర్,కాటేదాన్ ప్రాంతాల నుంచి వచ్చే వరద ఈ చెరువుకు చేరేదని చెబుతున్నారు.నిజాంల కాలంలో మీరాలం ట్యాంక్‌ను రాజులు,బమ్మకున్-ఉద్-దౌలా చెరువును రాణులు స్నానాలకు వినియోగించేవారని చెబుతున్నారు.అలాగే బమ్మకున్-ఉద్-దౌలా చెరువులో వనమూలికల చెట్లు,కొమ్మలు వేసి..ఆ దిగువన నిర్మించిన బావిలోకి వచ్చిన ఊట నీటిని తాగేందుకు నిజాం పాలకులు వినియోగించేవారని మరి కొంతమంది వివరిస్తున్నారు.ఔషధగుణాలున్న ఈ నీటిని మాత్రమే నిజాంలు వినియోగించేవారంటున్నారు.అంతే కాదు..ఈ చెరువు చుట్టు సువాసనలు వెదజల్లే పూల మొక్కలు విరివిగా ఉండేవని..ఆ పూలన్నీ చెరువులో పడడంతో ఇక్కడి నీటిని సెంటు తయారీకి వినియోగించేవారని..ఇందుకోసం అరబ్ దేశాలకు ఇక్కడి నీరు తీసుకెళ్లేవారంటున్నారు.ఇలా ఎంతో చరిత్ర ఉన్న ఈ చెరువు మళ్లీ పునరుద్ధరణకు నోచుకోవడం చాలా ఆనందంగా ఉందని పలువురు సంబర పడుతున్నారు.







చెరువును నిర్మించిన నవాబు

# బెంగాల్ గవర్నర్ ఆనందబోస్ రాజీనామా

## రాజకీయ ఒత్తిళ్లు కారణమై ఉండొచ్చన్న మమత

**కోల్‌కతా,మార్చి5 మార్చి5(ప్రభాత ఉదయం)**

పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ రాష్ట్రంలో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఆ రాష్ట్ర గవర్నర్ సీవీ ఆనంద బోస్ తన పదవికి రాజీనామా చేశారు. ఈ విషయాన్ని పశ్చిమ బెంగాల్ లోక్ భవన్ వర్గాలు వెల్లడించాయి. అయితే, ఆయన రాజీనామాకు గల స్పష్టమైన కారణాలు తెలియరాలేదు. సీవీ ఆనంద బోస్ రాజీనామాపై పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ స్పందించారు. ఆయన రాజీనామా విషయం తెలిసి తాను షాకయ్యానని చెప్పారు. 'గవర్నర్ రాజీనామాకు గల కారణం ప్రస్తుతానికి నాకు కూడా తెలియదు. ప్రస్తుత పరిస్థితుల్ని చూస్తుంటే నాకేమీ ఆశ్చర్యం అనిపించడం లేదు. త్వరలో రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో కేంద్ర మంత్రి నుంచి ఆయన మీద రాజకీయపరమైన ఒత్తిడి ఉండొచ్చు. కొత్త గవర్నర్‌గా తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవిని నియమిస్తున్నట్లు కేంద్ర మంత్రి నుంచి సమాచారం అందింది. గవర్నర్ తొలగింపు, కొత్త గవర్నర్ నియామకంలో కేంద్ర మంత్రి నన్ను సంప్రదించలేదు. ఇది రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం. సహకార విధానానికి కేంద్రం తగిన గౌరవం, ప్రాధాన్యం ఇవ్వాలి. రాష్ట్రాల గౌరవాన్ని కాపాడాలని మమత వ్యాఖ్యానించారు. ఇక.. గవర్నర్‌గా రాజీనామా చేసిన సీవీ ఆనంద బోస్ పశ్చిమ బెంగాల్‌లో మూడున్నరేళ్లు సేవలందించారు. ఆయనకు, సీఎం మమతా బెనర్జీకి మధ్య అనేక విభేదాలు తలెత్తాయి. అందువల్లే గవర్నర్ల వ్యవస్థను మమత తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఆనంద బోస్ ప్రస్తుతం ఢిల్లీలోనే ఉన్నారు. ఆయన కేంద్ర మంత్రుల్ని తన రాజీనామా విషయంపై సంప్రదిస్తున్నట్లు తెలుస్తోంది.

# దేవుణ్ణి ఆరాధించాలి : రెవరెండ్ సీ హెచ్ జాన్ మోజెస్


బైబిల్ సందేశాలను అందచేస్తున్న రెవరెండ్ సీ హెచ్ జాన్ మోజెస్. చిత్రంలో సిస్టర్ సీ హెచ్ ప్రభావతి లు...


ప్రార్థనలో పాల్గొన్న విశ్వాసులు..


విశ్వాసులు

**బుద్వేల్, మార్చి 5 (ప్రభాత ఉదయం)**

భూమి మీద నివసిస్తున్న ప్రతి ఒక్కరు దేవుని ఆరాధించే వారిగా ఉండాలని రాజేంద్రనగర్ మన్నా చర్చ్ పాస్టర్ రెవరెండ్ సీ హెచ్ జాన్ మోజెస్ అన్నారు. బుద్వేల్ సాయి కృష్ణ కాలనీ లోని బ్రదర్ సీ హెచ్ జాన్ - ఉమా ల ఇంటి ఆవరణలో గురువారం రాత్రి లెంట్ డేస్ ప్రేయర్ జరిగింది. ఈ ప్రార్థన కూడిక బ్రదర్ సీ హెచ్ జాన్ - ఉమా, బ్రదర్ శ్రీనివాస్ - మేరీ, బ్రదర్ దానం - నిర్మల, బ్రదర్ డానియల్ భీమయ్య - మాధవి కుటుంబాలు కలసి నిర్వహించాయి. ఈ సందర్భంగా రెవరెండ్ సీ హెచ్ జాన్ మోజెస్ మాట్లాడుతూ, ఈ సృష్టిని కలుగ చేసింది దేవుడైన యెహోవా అని గుర్తు చేశారు. ఆయనను వెంబడించే వారిగా, ఆరాధించే వారిగా ఉండాలన్నారు. అనంతరం అందరు ప్రేమ విందు లో పాల్గొన్నారు. సమావేశం లో సిస్టర్ సీ హెచ్ ప్రభావతి, గ్లాడి ప్రేమ్ సన్ తదితరులు పాల్గొన్నారు.



## కాటేదాన్ పారిశ్రామిక వాడలో

# అగ్నిప్రమాదం..

## భారీ ఆస్తి నష్టం!

## నాలుగు ఫైర్ ఇంజన్ ల సహాయంతో మంటలను అదుపు చేసిన ఫైర్ సిబ్బంది

**రాజేంద్రనగర్,మార్చి05(ప్రభాత ఉదయం)**

మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని కాటేదాన్ పారిశ్రామిక వాడలో బుధవారం అర్ధరాత్రి మరో భారీ అగ్నిప్రమాదం జరిగింది.దీంతో ఆప్రాంతమంతా దట్టమైన పొగతో నిండిపోయింది.ప్రమాద సమయంలో గోదాంలో కార్మికులు ఎవరూ లేకపోవడంతో ప్రాణ నష్టం తప్పింది.కాటేదాన్ లో నగరానికి చెందిన రిషాద్ జైన్ కు సుమిత్ ఎంటర్ప్రైజెస్ ప్లైవుడ్ గోదాము ఉంది. హోలీ పండుగను పురస్కరించుకుని రెండు రోజులుగా గోదాం మూసివేసి ఉంది.గురువారం ఉదయం అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. గోదాంలో నిల్వ ఉంచిన ప్లైవుడ్ షీట్స్ కు మంటలు క్షణాల్లోనే వ్యాపించడంతో భారీగా పెద్ద ఎత్తున మంటలు చేరేగాయి.గోదాం పక్కనే నివాసం ఉంటున్న కార్మికులు మొదటగా మంటలను ఆర్పేందుకు ప్రయత్నించినప్పటికీ..చెక్క సామగ్రి ఎక్కువగా ఉండటంతో వారు అదుపు చేయలేకపోయారు.దీంతో రాజేంద్రనగర్ అగ్నిమాపక సిబ్బందికి,పోలీసులకు సమాచారం అందించారు. రాజేంద్రనగర్ ఏసిపి శ్రీనివాస్ అగ్నిమాపక సిబ్బందితో కలిసి ఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేసే పనిలోపడ్డారు.నాలుగు ఫైర్ ఇంజిన్ల సహాయం తో అగ్నిమాపక సిబ్బంది 3గంటలపాటు శ్రమించి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు.ఈ ఘటనలో సుమారు 20లక్షల వరకు ఆస్తి నష్టం జరిగి ఉండొచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. అగ్నిప్రమాదానికి గల కారణాలపై అధికారులు విచారణ చేపట్టారు.


రైతులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఉద్యాన శాఖ అధికారి రాజశేఖర్

# పామాయిల్ సాగుతో రైతుకు ఎంతో లాభదాయకం

## ఉద్యాన శాఖ అధికారి రాజశేఖర్

## గుంటిపల్లి గ్రామంలో ఆయిల్ పామ్ సాగుపై అవగాహన సదస్సు

**గద్వాల జిల్లా ప్రతినిధి ,మార్చి5(ప్రభాత ఉదయం)**

పామాయిల్ సాగుతో రైతుకు ఎంతో లాభదాయకమని గద్వాల డివిజన్ ఉద్యాన శాఖ అధికారి రాజశేఖర్ అన్నారు.గురువారం గద్వాల మండలం పరిధిలోని గుంటిపల్లి గ్రామం రైతు వేదిక ఆవరణలో ఆయిల్ పామ్ సాగుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని తెలంగాణ ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ , వ్యవసాయ, ఉద్యాన శాఖల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగాగద్వాల డివిజన్ ఉద్యాన శాఖ అధికారి ఎం రాజశేఖర్ మాట్లాడుతూ ... గ్రామాల్లో ప్రతి రైతుకు ఆయిల్ పామ్ లాభాలపై పూర్తి అవగాహన కల్పించడమే సదస్సు ఉద్దేశ్యం అని అన్నారు. అధిక సబ్సిడీలతో పాటు ప్రభుత్వం గ్యారెంటీ ధర నిర్ణయించి, దళారీ వ్యవస్థ లేకుండా రైతులకు నేరుగా లాభాలు చేకూరేలా తెలంగాణ ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ పనిచేస్తోందన్నారు. దేశంలో వంటనూనెల అవసరం పెరుగుతున్న నేపథ్యంలో, ఆ అవసరాన్ని దేశీయంగా తీర్చేందుకు ప్రభుత్వం పామాయిల్ సాగును ప్రోత్సహిస్తోందన్నారు. ఒకసారి నాటితే 25ఉ30 సంవత్సరాల పాటు ఆదాయం ఇచ్చే దీర్ఘకాలిక పంట అన్నారు. 3వ సంవత్సరం నుంచి పండ్లు రావడం ప్రారంభమై, 4వ సంవత్సరం నుంచి పూర్తి దిగుబడి లభిస్తుందన్నారు. ఒక ఎకరాకు మంచి దిగుబడి వస్తుందన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరకు మిల్లులు కొనుగోలు చేస్తాయని రైతులకు వివరించారు. త్వరలోనే గద్వాల్ జిల్లాలో ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ మిల్ ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. రైతులకు పామ్ ఆయిల్ పంటతో దీర్ఘకాల ఆదాయం, అధిక దిగుబడి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మ పీడీ జగ్గు నాయక్,గద్వాల మండలం వ్యవసాయ అధికారి ప్రతాప్ కుమార్, గ్రామ సర్పంచ్ శివ కుమార్,వ్యవసాయ విస్తరణ అధికారులు హరీష్, రవి కుమార్, గద్వాల మండల ఆయిల్ పేడ్ ఫీల్డ్ ఆఫీసర్ శశిధర్ గౌడ్.అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

# యువకుడు ఆత్మహత్య

**గద్వాల జిల్లా ప్రతినిధి, మార్చి 5(ప్రభాత ఉదయం)**

ఒడిస్సా రాష్ట్రానికి చెందిన సరోజ్ (21) బుధవారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. ఒడిస్సాకు చెందిన సరోజ్ గద్వాలలోని శ్రీకృష్ణ గ్రాండ్ హోటల్ లో వేయిటర్ గా పని చేస్తున్నాడు. భీంనగర్ లో ఓ ఇంటిలో నివసిస్తున్న సరోజ్ ఇంట్లో ఎవరు లేని సమయంలో కిటికి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. అతని స్నేహితులు కిటికిలోంచి చూడ గా విగత జీవిగా కన్పించాడు. సమాచారం అందుకున్న గద్వాల టౌన్ పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని గద్వాల జిల్లా ఆసుపత్రికి తరలించారు. కాగ మృతి చెందిన సరోజ్ కు ఒడిస్సాకు చెందిన యువతితో ప్రేమ వ్యవహారం కొనసాగిందని, యువతి కుటుంబ సభ్యులు పెళ్లికి నిరాకరించినట్లు తెలిసింది. దీంతో మనస్తాపం చెందిన యువకుడు ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిసింది.

# దర్జాగా కందకం కబ్జా





జిల్లా కేంద్రంలో చారిత్రాత్మక కందకం పూడ్చి కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మించిన కబ్జాదారుడు

## జిల్లా కేంద్రం నడిబొడ్డున ఘటన

**గద్వాల, మార్చి 5(ప్రభాత ఉదయం)**

గద్వాల పురపాలికల్లో అంతర్గత రహదారులు, మురుగుకాలువలు, విలువైన ప్రభుత్వ భూములు, లేఅవుట్ ఖాళీ స్థలాలు ఆక్రమణలకు గురవుతున్నాయి. కొందరు వ్యక్తులు నిబంధనలను పట్టించుకోకుండా ఇష్టానుసారంగా ఆ స్థలాల్లో నిర్మాణాలు చేపడుతున్నారు. అధికారుల పర్యవేక్ష లోపం, సమయానికి చర్యలు తీసుకోకపోవడం వంటి కారణాలతో కబ్జాలు రోజు రోజుకూ పెరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. సమస్యను పరిష్కరించాలంటూ పుర అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నా పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. వీధుల్లో అంతర్గత రహదారులు ఇరుగ్గా మారుతుండటంతో రాకపోకలకు, రానున్న రోజుల్లో ట్రాఫిక్ సమస్యలు ఎదురుకానున్నాయి. డ్రైనేజీ సమస్య తీవ్రం కానుం.. కొత్తగా ఎన్నికైన పాలకవర్గాలు స్పందించి స్పందించి ఆక్రమణలను గుర్తించి కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

**దర్జాగా కందకం కబ్జా**

గద్వాల పట్టణ 16వ వార్డు భీంనగర్ లో గల సాయి కృపా హాస్పిటల్ నుంచి రెవెన్యూ కాలనీకి వెళ్లే మార్గంలో ఉన్న ప్రధాన డ్రెయినేజీ కాలువలు కబ్జా చేసేశారు. నిబంధనల ప్రకారం డ్రెయినేజీ వరకే నిర్మాణం చే పట్టాల్సి ఉండగా.. డ్రెయినేజీని దాటి నిర్మాణాలు చేపడుతున్నారని భీంనగర్ కాలనీవాసులు ఆరోపించారు. ఏకంగా డ్రైనేజి కాలువపై షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టడంతో స్థానికులు,నగరవాసులు కంగుతింటున్నారు. అలాగే మరో ఇంటి యజమాని ఇంటి ముందర ఉన్న డ్రైనేజి కాలువను పది ఫీట్ల మేర జరిపి మరో కొత్త డ్రైనేజీ కాలువను నిర్మించి పాత డ్రైనేజీ కాలువ పూడ్చివేసే పనిలో నిమగ్నమయ్యారు. మరి కొందరు డ్రైనేజీ కాలువ పక్కన ఉన్న ఖాళీ స్థలం కొరకు కొందరు డ్రైనేజీ కాలువను చిన్నగా చేసి ప్లాట్ కబ్జాకు యత్నిస్తున్నారు. ఇళ్ల నుంచి వచ్చే మురుగునీరు, వరదనీరు ఈ డ్రెయినేజీ ద్వారానే కందకంలోకి వెళుతుంది. కానీ అక్రమ నిర్మాణ సమయంలో డ్రెయినేజీలో మురుగు నీరు నిలిచిపోయింది. దీంతో స్థానికులు మున్సిపల్ కమిషనర్‌కు, అధికారులకు ఫిర్యాదు చేశారు. సామా న్య వ్యక్తులు కబ్జాలు చేస్తే అధికారులు వేధింపులు, చర్యలు తీసుకుంటారు. కానీ అధికారుల అండదండలతో కబ్జాదారులు కబ్జా చేస్తే మాత్రం పట్టించుకోవడం లేదని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికై నా మున్సిపల్ అధికారులు స్పందించి అక్రమార్కులపై తగిన చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



శుభాకాంక్షలు తెలుపుతున్న ధన్వంతి లక్ష్మినారాయణ లకావత్

## వేం నరేందర్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపిన జనగామ డీసీసీ అధ్యక్షురాలు

**జనగామ జిల్లా ప్రతినిధి, మార్చి 05(ప్రభాత ఉదయం):**

రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికైన వేం నరేందర్ రెడ్డి ని జనగామ డీసీసీ అధ్యక్షురాలు ధన్వంతి లక్ష్మినారాయణ నాయక్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి పూల బొకే ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు.



## సీనియర్ జర్నలిస్ట్ చిటుకుల అంజయ్యను పరామర్శించిన గుడి వంశీధర్ రెడ్డి

**జనగామ జిల్లా ప్రతినిధి, మార్చి 05(ప్రభాత ఉదయం)**

జిల్లా కేంద్రంలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో లింగాల ఘణపూర్ మండలం వడిచర్ల గ్రామానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ చిటుకుల అంజయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతుండగా కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ జెడ్పిటిసి సభ్యులు గుడి వంశీధర్ రెడ్డి వారిని పరామర్శించి వారి కుటుంబానికి మనోధైర్యాన్ని కల్పించారు. వారితోపాటుగా మండల పార్టీ అధ్యక్షులు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కొల్లూరు శివకుమార్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



పీహెచ్ సిని తనిఖీ చేస్తున్న జిల్లా కలెక్టర్

## పేదలకు మెరుగైన వైద్యం అందించాలి

**పీహెచ్సి ని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్**

**జనగామ జిల్లా ప్రతినిధి, మార్చి 05(ప్రభాత ఉదయం ):**

నిరుపేదలకు మెరుగైన వైద్య సేవలను అందించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. బుధవారం లింగాల ఘనపూర్ పీహెచ్ సి ని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆకస్మికం గా సందర్శించారు. ఈ సందర్భంగా ఓపి రిజిస్టర్, ల్యాబ్, ప్రసూతి గది ని కలెక్టర్ పరిశీలించి మెడికల్ అధికారికి కలెక్టర్ పలు ఆదేశాలు జారీ చేసారు. గర్భిణీ లకు నిర్దేశిత కాలం లో చెక్ అప్ లు జరగాలని వారు ప్రభుత్వ ఆసువత్రి లోనే ప్రసవం అయ్యేలా వైద్య సిబ్బంది ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలన్నారు.

## ఖాజీపల్లిలో లేగదూడను చంపిన చిరుత

**ఆందోళనలో స్థానికులు**

**పటాన్ చెరు, మార్చి 5 (ప్రభాత ఉదయం):**



ఇటీవల స్థానికంగా కలకలం రేపిన చిరుత సంచారం మరువక ముందే మళ్ళీ చిరుత లేగదూడను చంపడంతో మరోసారి ఖాజీపల్లిలో కలకలం సృష్టించింది. సంగారెడ్డి జిల్లా గడ్డపోతారం మున్సిపల్ పరిధిలోని ఖాజిపల్లి అటవీ ప్రాంతంలోని ఖాజి చెరువు సమీపంలో ఆవు దూడను చంపి తిన్న విషయం తెలుసుకున్న గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. దీంతో స్థానిక ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు స్థానికులకు సూచించారు.



## మహిళల ఉన్నత విద్య కోసం ప్రభుత్వ కళాశాలలో ముఖ్య పాత్ర

**ఎమ్మెల్యే కృష్ణ మోహన్ రెడ్డి**

**2026-27 విద్యా సంవత్సరం బ్రోచర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే**

**గద్వాల, మార్చి 5(ప్రభాత ఉదయం)**

గద్వాల్ పట్టణంలోని ప్రియదర్శిని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో 2026ఉ27 విద్యా సంవత్సరానికి సంబంధించిన అడ్మిషన్ బ్రోచర్‌ను గద్వాల్ ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ...మహిళల ఉన్నత విద్యాభివృద్ధికి ప్రభుత్వ కళాశాలలు ముఖ్య పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. విద్యార్థినులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని డిగ్రీ విద్యను అభ్యసించి భవిష్యత్తులో మంచి స్థాయికి చేరుకోవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎ. మీనాక్షి మాట్లాడుతూ.. 2026ఉ27 విద్యా సంవత్సరానికి కళాశాలలో వివిధ డిగ్రీ కోర్సుల్లో అడ్మిషన్లు కొనసాగుతున్నాయని తెలిపారు. విద్యార్థినులు ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను ఉపయోగించుకుని కళాశాలలో చేరాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, నాయకులు పాల్గొన్నారు

## హెల్త్ మిషన్-100 డేస్

**కార్యక్రమం సద్వినియోగం చేసుకోవాలి:**

**డి ఎం హెచ్ ఓ డాక్టర్ జై. సంధ్యా కిరణ్మయి**

**గద్వాల జిల్లా ప్రతినిధి, మార్చి 5(ప్రభాత ఉదయం)**



ఈనెల ఆరో తేదీ నుండి 12వ వరకు తెలంగాణ ప్రభుత్వం, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ డిపార్ట్మెంట్ చేపట్టనున్న వివిధ ఆరోగ్య కార్యక్రమాలు,““ హెల్త్ మిషన్-100 డేస్ ““కార్యక్రమం విజయవంతం చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ జై. సంధ్యా కిరణ్మయి కోరారు. కార్యక్రమంలో భాగంగా వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని, జోగులాంబ గద్వాల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జై. సంధ్యా కిరణ్మయి తెలిపారు..ఈ కార్యక్రమాలు నాలుగు దశల్లో ఉంటాయని, మొదటి దశలో భాగంగా (1-30 రోజులు ) మాతా శిశు సంరక్షణ సేవలు అందించడం, కౌమార దశ బాలికలకు సేవలందించడం, వృద్ధులకు సేవలు అందించడం జరుగుతుంది, అదేవిధంగా స్పెషలిస్ట్ సేవలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో హెల్త్ క్యాంపులు నిర్వహించడం, గర్భిణీ స్త్రీలకు బాలింతలకు రక్త పరీక్షలు చేయడం, చికిత్సలు అందించడం జరుగుతుంది, అదేవిధంగా =దీూఖ బృందాల ద్వారా ప్రభుత్వ స్కూళ్లలో అంగన్వాడి స్కూల్లో పిల్లలకు స్క్రీనింగ్ చేయడం, జరుగుతుందన్నారు. రెండవ దశలో(31-45 రోజులు) 30 సంవత్సరాలు దాటిన వారికి అసంక్రమిత వ్యాధుల గురించి, క్యాన్సర్, డయాబెటిస్, హైపర్ టెన్షన్ మొదలగు వ్యాధుల ను స్క్రీనింగ్ చేయడం జరుగుతుందన్నారు. మూడవ దశలో(46-75 రోజులు) అనుమానిత క్షయ వ్యాధి లక్షణాల వారికి, టెస్టులు చేయడం చికిత్స నిర్వహించడం, ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులకు చికిత్స నిర్వహించడం, అంటువ్యాధులకు చికిత్సలు చేయడం జరుగుతుంది.. నాలుగో దశలో(76-100 రోజులు) ట్రైబల్ హెల్త్ సేవలు మొబైల్ మెడికల్ యూనిట్ ద్వారా అందజేయడం జరుగుతుందన్నారు.అంతేకాకుండా ఈ హెల్త్ మిషన్ -100 డేస్ లో భాగంగా జిల్లాలో ఉన్న అన్ని మహిళా సంఘాల్లోని మహిళలకు (హ్రఎ+) టీ- డయాగ్నస్టిక్స్ ద్వారా 30 రకాల రోగ నిర్ధారణ పరీక్షలు చేయడం, గ్రామీణ మహిళలకు డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ రూపకల్పన చేయడం జరుగుతుంది తెలిపారు.




నేరస్థుడిని అరెస్ట్ చేసిన పోలీసులు

## సైబర్ నేరాలకు పాల్పడుతున్న వ్యక్తిని అరెస్ట్ చేసిన జనగామ పోలీస్‌లు

**జనగామ జిల్లా ప్రతినిధి, మార్చి 05(ప్రభాత ఉదయం):**

జనగాం పట్టణానికి చెందిన మహేష్ అనే వ్యక్తి హైదరాబాద్‌లో ఉండి మొబైల్‌లో బినాన్స్ యాప్ ద్వారా నాలుగు మ్యూల్ అకౌంట్లు సృష్టించి, ఇతరులతో చేతులు కలిపి ఆ అకౌంట్ల ద్వారా ఆర్థిక లావాదేవీలు నిర్వహిస్తూ సైబర్ నేరాలకు పాల్పడినట్లు పోలీసుల విచారణలో బయటపడిందని, ఈ విషయమై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టగా నిందితుడు మహేష్ పాత్ర స్పష్టంగా బయటపడినట్లు జనగాం టౌన్ సిఐ సత్యనారాయణ రెడ్డి , ఎస్ఐ భరత్ శుక్రవారం తెలిపారు. సైబర్ నేరాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.




ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్

## పీఎం-సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన ప్రచార రథం ప్రారంభం

**జనగామ జిల్లా ప్రతినిధి, మార్చి 5(ప్రభాత ఉదయం):**

దేశంలో ఒక కోటి కుటుంబాలకు లబ్ది చేకూర్చడానికి, పీఎం - సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకం ద్వారా ప్రతీ విద్యుత్ వినియోగదారుడు తమ ఇళ్ల రూఫ్ టాప్ పై సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేసుకొని విద్యుత్ బిల్లులు తగ్గించుకోవాలని, కర్బన ఉద్గారాలు జీరో స్థాయికి తేవాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పిలుపునిచ్చారు.గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో విస్తృత అవగాహన కల్పించడానికి ఉద్దేశించిన ప్రచార రథాన్ని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు.ఈ సందర్భంగా రెడ్కో జిల్లా మేనేజర్ మహేందర్ రెడ్డి మాట్లాడుతూ... 3 కిలోవాట్ల పలకలు ఏర్పాటు చేసుకొంటే కేంద్ర ప్రభుత్వం రూ.78 వేలు సబ్సిడీ అందిస్తుందని, దాంతో పాటు ప్రతీ నెలా రూ.2 వేల విద్యుత్ బిల్లు అదా చేయవచ్చని తెలిపారు. పెట్టుబడి ఆరు సంవత్సరాల్లో తిరిగి వస్తుందని అన్నారు. సోలార్ విద్యుత్ పర్యావరణ హితమని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనగామ జిల్లా విద్యుత్ ఎస్ ఈ సంపత్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# నేటి నుండే ప్రజా పాలన..ప్రగతి ప్రణాళిక ప్రారంభం



సమావేశంలో పాల్గొన్న అధికారులు

### ఈ నెల 6 నుండి జూన్ 12 వరకు జరిగే 99 రోజుల కార్యాచరణ కి పకడ్బందీగా..ప్రణాళిక

### టీమ్ వర్క్ తో ముందుకు వెళ్ళాలి

### డెడికేషన్ తో పని చేయాలి

### జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**జనగామ జిల్లా ప్రతినిధి, మార్చి 05(ప్రభాత ఉదయం)**



రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు 99 రోజుల పాటు చేపట్టనున్న ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా సమర్ధవంతంగా మిషన్ మోడ్ తో నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులను అదేశించారు.

సమీకృత జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్ లో గురువారం ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక కార్యకర్యమాల నిర్వహణపై ఎంపీడీఓ, ఎంపీవో పంచాయతీ రాజ్ శాఖ సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.

ప్రజా పాలన ఉ ప్రగతి ప్రణాళిక కింద చేపట్టాల్సిన అంశాలపై శాఖల వారీగా సమీక్ష నిర్వహించి కలెక్టర్ స్పష్టమైన దిశానిర్దేశం చేశారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 6వ తేదీ (నేటి) నుంచి జిల్లాలోని అన్ని గ్రామాలు, మున్సిపాల్టీలల్లో కార్యక్రమాలను టీమ్ వర్క్ తో చేపట్టాలన్నారు.

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు 99 రోజుల పాటు చేపట్టనున్న ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ అన్నారు. 99 రోజులపాటు నిర్వహించనున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రతి శాఖ ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసి నిర్దేశిత గడువులో అమలు చేయాలని ఆదేశించారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో పెండింగ్‌లో ఉన్న ఫైళ్లను వేగంగా పరిష్కరించాలని, అనవసరంగా నిల్వ ఉన్న స్క్రాప్‌ను డిస్పోజ్ చేయాలని, ఈ ఆఫీస్ నిర్వహణ జరగాలని, పాతబడిన ఫర్నిచర్, వాహనాలను లిస్ట్ చేసి పెట్టుకోవాలని ఆదేశించారు.

శానిటేషన్ డ్రైవ్ చేపట్టాలని, అన్ని కార్యాలయాల పరిసరాలు పరిశుభ్రం గా పెట్టాలన్నారు.

ప్రతీ జిపి లో ఉండే ప్రభుత్వ కార్యాలయం, సబ్ సెంటర్, పీహెచ్ సి అంగన్వాడీ కేంద్రం, బస్ స్టాప్, పల్లె ప్రకృతి పార్క్, ఇలా ప్రతీ ప్రాంతంలో శానిటేషన్ కార్యక్రమాలను చేపట్టాలన్నారు.

అలాగే అన్ని ట్యాంక్ లను క్లీన్ చేయడం, క్లోరినేషన్, ఫాగింగ్ చేయాలన్నారు.

డ్రై రిసోర్స్ కలెక్షన్ సెంటర్ల నిర్వహణ, కమ్యూనిటీ సోక్ పిట్స్ నిర్మాణం ఉండాలన్నారు.

ప్రతీ కార్యక్రమం చేపట్టే ముందు... ప్రస్తుత పరిస్థితి అలాగే ఆక్టివిటీ అయ్యాక తర్వాత పరిస్థితి కి సంబందించి ఫోటో ల రూపం లో తీయాలన్నారు.


ఈ సమావేశం లో జడ్పీ సీఈఓ మాధురి షా, డిఆర్డిఓ వసంత, ట్రైని డీపీవో నవీన్, డిఎంఎచ్ఓ మల్లికార్జున్ రావు, ఎంపీడీఓ లు, ఎంపీవో లు తదితరులు పాల్గొన్నారు

# విద్యార్థుల భవిష్యత్తుకు పదవ తరగతి ఎంతో కీలకం

## జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్

**గద్వాల జిల్లా ప్రతినిధి, మార్చి 5(ప్రభాత ఉదయం)**



విద్యార్థుల భవిష్యత్తు జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకునేందుకు పదోతరగతి ఎంతో కీలకంగా నిలుస్తుందని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో గురువారం ఐడిఓసి వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లాలోని అన్ని విద్యాసంస్థల 10వ తరగతి విద్యార్థులకు వివిధ సబ్జెక్టుల నిపుణులతో జూమ్ మీటింగ్ ద్వారా ఆయా సబ్జెక్టుల్లోని ముఖ్యాంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులకు ప్రీ ఫైనల్ పరీక్షల్లో వచ్చిన మార్కులను పరిశీలించగా ఎక్కువగా గణితం, హిందీ, తెలుగు సబ్జెక్టుల్లో తక్కువ మార్కులు వచ్చాయన్నారు. అలాగే ఆయా సబ్జెక్టుల్లో విద్యార్థులకు వచ్చిన మార్కులను ఆధారంగా చేసుకుని విద్యార్థులను ఏ, బి, సి, డి కేటగిరీలుగా విభజించడం జరిగిందన్నారు. ఈనెల 14 నుంచి 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు నిర్వహిస్తుండడంతో ప్రధానంగా సి, డి కేటగిరీలలో ఉన్న విద్యార్థులకు ఆయా సబ్జెక్టుల నుంచి అడిగే ముఖ్యమైన అంశాలను తెలియజేసేందుకు నిపుణులచే అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. పరీక్షలకు చాలా తక్కువ సమయం ఉండడంతో విద్యార్థులు గత ఐదు సంవత్సరాలుగా ఎస్ఎస్సి పబ్లిక్ పరీక్షల్లో అడిగిన ప్రశ్న పత్రాలను పరిశీలించి వాటిలో నుంచి ఎక్కువసార్లు అడిగిన ప్రశ్నలను సాధన చేస్తే సి, డి కేటగిరీలలో ఉన్న విద్యార్థులు కూడా మంచి మార్కులతో పాస్ అవుతారన్నారు.

**జోగులాంబ గద్వాల జిల్లా టాప్ 15 లో ఉండాలి.**

జోగులాంబ గద్వాల జిల్లా పదో తరగతి పరీక్ష ఫలితాల్లో 2024 - 2025 విద్యా సంవత్సరంలో రాష్ట్రంలో 26వ స్థానంలో, 2023-2024 విద్యా సంవత్సరంలో 31 వ స్థానంలో ఉందన్నారు. ఈ విద్యా సంవత్సరంలో మన జిల్లా కనీసం టాప్ -15 లో ఉండేలా ఫలితాలు రావాలంటే ఆయా విద్యాసంస్థల ఉపాధ్యాయులు బాధ్యత తీసుకోవాలన్నారు. ప్రతి పరీక్షకు నాలుగైదు రోజులు ఖాళీ ఉండటంతో ఆ సమయంలోను వివిధ సబ్జెక్టుల్లోని ముఖ్యమైన ప్రశ్నలను గురించి పదవ తరగతి విద్యార్థులకు ప్రత్యేకంగా అవగాహన కల్పించాలన్నారు. విద్యార్థులు కూడా తప్పనిసరిగా పరీక్షల మధ్యన వచ్చిన సమయాన్ని సద్వినియోగం చేసుకునేందుకు తమ విద్యాసంస్థల్లో ఆయా సబ్జెక్టుల ఉపాధ్యాయులు తెలియజేసే ముఖ్యమైన అంశాలను శ్రద్ధగా సాధన చేసి మంచి మార్కులు పొందాలని ఆకాంక్షించారు.

**ఒత్తిడి, భయాన్ని వీడేందుకు ధ్యానం సాధన చేయాలి.**

పరీక్షలనగానే కొంతమంది విద్యార్థులు ఒత్తిడికిలోనై ఇబ్బంది పడుతున్నారని, భయాన్ని వీడేందుకు కొంత సమయాన్ని ప్రశాంతంగా ధ్యానం చేసేందుకు కేటాయించాలన్నారు. ఫలితంగా విద్యార్థుల్లో జ్ఞాపకశక్తి పెరిగి తాము చదివిన పాఠ్యాంశాలు బాగా గుర్తు ఉంటాయన్నారు. జోగులాంబ గద్వాల జిల్లాలో గత విద్యా సంవత్సరంలో రెండు శాతం విద్యార్థులు పరీక్షలకు హాజరు కాలేదన్నారు. విద్యార్థులు పరీక్షలకు చిన్న చిన్న కారణాలతో గైర్హాజరు కావడం వలన ఆ ప్రభావం సంబంధిత విద్యాసంస్థల పాస్ శాతంపై పడుతుందన్నారు. ప్రతి విద్యాసంస్థలో వంద శాతం ఫలితాలు రావాలంటే ప్రతి విద్యార్థి అన్ని పరీక్షలకు హాజరు కావాలని సూచించారు. ఈ విషయంలో విద్యార్థుల తల్లిదండ్రులను సంబంధిత పాఠశాలలో ఉపాధ్యాయులు వ్యక్తిగతంగా కలిసి కౌన్సిలింగ్ నిర్వహించాలని ఈ సందర్భంగా కలెక్టర్ ఆదేశించారు.

**విద్యార్థులు తగిన జాగ్రత్తలు పాటిస్తే మంచి మార్కులు.**

విద్యార్థులు పరీక్షలు ముగిసే వరకు సెల్ ఫోన్స్ కు, టీవీలకు దూరంగా ఉండాలన్నారు. మంచి పౌష్టికాహారం తీసుకుంటూ, వేసవిని దృష్టిలో ఉంచుకొని తగినంత నీళ్లు తాగాలన్నారు. కనీసం 6 నుంచి 8 గంటల పాటు నిద్ర పోవాలని, రాత్రివేళ నిద్రపోకుండా మేలుకొంటే పరీక్ష రాసే సమయంలో ఇబ్బంది పడాల్సి వస్తుందన్నారు. ప్రతి పరీక్షా కేంద్రంలో ప్రాథమిక చికిత్స అందించేందుకు వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. విద్యార్థులకు అనుకోకుండా ఎలాంటి ఆరోగ్య సమస్యలు వచ్చినా అవసరమైన వైద్య సహాయం అందించబడుతుందన్నారు. విద్యార్థులు హాల్ టికెట్స్ తో పాటు మంచి పెన్నులు, ఇతర అవసరమైన విద్యాసామాగ్రిని సిద్ధంగా ఉంచుకొని పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలన్నారు. విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు నిర్దేశిత సమయం కంటే ముందుగానే చేరుకొని పరీక్ష సమయం ముగిసేంతవరకు అన్ని ప్రశ్నలకు జవాబులు రాయాలని సూచించారు. సమయం మిగిలితే రాసిన జవాబులన్నింటిని సరిచూసుకోవాలని, ఆయా సమాధానాలకు అవసరమైన శీర్షికలు, ఉపశీర్షికలు పెట్టడం వలన మంచి మార్కులు సాధించవచ్చన్నారు. మంచి చేతి వ్రాత కూడా ఎక్కువ మార్కులు సాధించేందుకు ఉపకరిస్తుందన్నారు.

**కేటగిరివారీగా టాపర్లకు సైకిళ్ల బహుమతి.**

జిల్లాలోని మండలాల వారీగా, కేజీబీవీలు, గురుకులాలు, జడ్పిహెచ్ఎస్, తదితర కేటగిరీల వారీగా పదవ తరగతి పరీక్షల్లో టాపర్లుగా నిలిచిన విద్యార్థులకు సైకిళ్లను బహుమతిగా ఇవ్వనున్నట్లు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ప్రకటించారు. తాను ఇదివరకు పనిచేసిన జనగామ జిల్లాలో

గతేడాది పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో ఆయా కేటగిరీలలో టాపర్లుగా నిలిచిన సుమారు 300 మంది విద్యార్థులకు సైకిళ్లను బహుమతిగా ఇచ్చినట్లు పేర్కొన్నారు.

**విద్యార్థులకు స్ఫూర్తినిచ్చేందుకే కలెక్టర్ లేఖల అందజేత.**

జిల్లా విద్యాశాఖ సౌజన్యంతో జిల్లాలోని అన్ని విద్యాసంస్థల పదవ తరగతి విద్యార్థులకు స్ఫూర్తినిచ్చేందుకు తాను స్వయంగా రాసిన కలెక్టర్ సర్ లేఖను అందించడం జరిగిందన్నారు. ప్రతి విద్యార్థి ఈ లేఖలోని ఏడు ముఖ్యాంశాలను చదివి ప్రేరణ పొందాలని ఆకాంక్షించారు. పదో తరగతి విద్యార్థులు పరీక్షలను ఎలాంటి ఇబ్బంది లేకుండా విజయవంతంగా రాయాలని ఈ సందర్భంగా కలెక్టర్ శుభాకాంక్షలు తెలియజేశారు.

**500కు పైగా మార్కులు సాధించేందుకు కృషి చేయాలి.**

జోగులాంబ గద్వాల జిల్లా విద్యార్థులు ఎక్కువ శాతం 500 కు పైగా మార్కులు సాధించేందుకు కృషి చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పలు విద్యాసంస్థల విద్యార్థులతో కలెక్టర్ మాట్లాడుతూ వారి మార్కుల లక్ష్యాన్ని సబ్జెక్టుల వారీగా అడిగి తెలుసుకున్నారు.అనంతరం గద్వాల ప్రభుత్వ అభ్యసన ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయులు, రచయిత అనిమోని మహేందర్ రాసిన అమర శ్రీ వ్యాకరణం పుస్తకాన్ని కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి విజయలక్ష్మి, డిపిఓ శ్రీకాంత్, సెక్టోరియల్ అధికారి మైఖేల్, ఆయా సబ్జెక్టుల నిపుణులు, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఈ నెల7,8 తేదీలలో తాగునీటి సరఫరాలో అంతరాయం

## వాటర్ బోర్డు అధికారుల వెల్లడి

**హైదరాబాద్, మార్చి 5 (ప్రభాత ఉదయం)**

హైదరాబాద్ నగరానికి తాగునీరు సరఫరా చేసే మంజీరా ఫేజ్-3, పెద్దాపూర్ పంప్ లోని పంప్ హౌస్ లో 35 సంవత్సరాలకు పైగా పాతబడిన హెచ్‌టి (హై టెన్షన్) ఎలక్ట్రికల్ ప్యానెల్స్‌ను తొలగించి, వాటి స్థానంలో కొత్త ప్యానెల్స్‌ను ఏర్పాటు చేయనున్నారు. అదే సమయంలో, పెద్దాపూర్ నుంచి సింగాపూర్ వరకు ఉన్న 1600 మిమీ డయా పంపింగ్ మెయిన్ పైప్‌లైన్‌లోని ఎయిర్ వాల్వ్‌లను, అలాగే సింగాపూర్ నుంచి పెద్దాపూర్ వరకు ఉన్న 2000 మిమీ డయా గ్రావిటీ మెయిన్ పైప్‌లైన్‌లోని ఎయిర్ వెంట్స్‌ను మార్పిడి చేస్తూ మరమ్మతు పనులు చేపడుతున్నారు.ఈ పనులను ఈనెల 7 తేదీ శనివారం ఉదయం 8 గంటల నుంచి 8 వ తేదీ అదివారం రాత్రి 8 గంటల వరకు చేపట్టనున్నారు. కావున ఈ 36 గంటలు కింద పేర్కొన్న కొన్ని ప్రాంతాల్లో లో ప్రెజర్ తో నీటిసరఫరా, మరికొన్ని ప్రాంతాల్లో సరఫరాలో అంతరాయం కలుగుతుంది.

**అంతరాయం ఏర్పడే ప్రాంతాలు:**

1.ఓ అండ్ ఏం డివిజన్ నెం.3: షేక్‌పేట్ రిజర్వాయర్‌కు నీటి సరఫరా పూర్తిగా నిలిపివేయబడుతుంది.

భోజగుట్ట ప్రాంతానికి తక్కువ ఒత్తిడితో నీటి సరఫరా ఉంటుంది.

2. ఓ అండ్ ఏం డివిజన్ నెం.18: మణికొండ, కోకాపేట్, నర్సింగి, మంచిరేవుల తదితర ప్రాంతాలకు నీటి సరఫరా ఉండదు.

3. ట్రాన్స్‌మిషన్ × & ××: నీటి సరఫరా పూర్తిగా నిలిపివేయబడుతుంది. మంచినీటి వినియోగదారులు

పైన పేర్కొన్న ప్రాంతాల వినియోగదారులు నీటిని పొదుపుగా వాడుకోవాలని జలమండలి అధికారులు ప్రజలకు సూచించారు.







# వివాహ వేడుకల్లో పాల్గొన్న మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ మూలమల్ల రాజేశ్వరి భీమ్ రెడ్డి దంపతులు

**కొత్తకోట, మార్చి 5(ప్రభాత ఉదయం)**

వనపర్తి జిల్లా కొత్త కోట మండల పామపురం కిచ్చన గారి వెంకటేశ్వరమ్మ, రాంరెడ్డి దంపతుల పుత్రిక అర్చన వివాహం కొప్పునూర్ (చిన్నం బావి) మండలం స్వర్గయ బంకు మిది నరసింహ రెడ్డి అరుణ ప్రథమ పుత్రుడు సంపత్ కుమార్ రెడ్డి తో వివాహం జరిగింది. కొత్తకోట మండలం విలియం కొండ లోని జె.వి.ఆర్ కళ్యాణం మండపంలో జరిగిన వివాహ వేడుకలకు వనపర్తి రోడ్ మాజీ మార్కెట్ చైర్మన్ మూల మళ్ళ రాజేశ్వరి భీమ్ రెడ్డి,నాయకులు మూలమళ్ళ యుగంధర్ రెడ్డి ల సరస్వతి లు హాజరై నూతన వదూ వరులను ఆశీర్వదించారు.అనంతరం గోపాల్ పెట మండలం కేంద్రంలో పద్మావతి గార్డెన్ లో జరిగిన కొత్తకోట మండలం రామకృష్ణాపురం గ్రామానికి చెందిన స్వర్గీయ బోయినపల్లి వెంకటరామిరెడ్డి, ఇందిరమ్మ దంపతుల కుమారుడు సంపత్ కుమార్ రెడ్డి వివాహం పాన్ గల్ మండలం రేమద్దుల గ్రామం పత్తికొండ నాగేశ్వరమ్మ, జైపాల్ రెడ్డి ప్రథమ పుత్రిక తో వివాహం జరిగింది. ఈ వేడుకల్లో వనపర్తి రోడ్డు మాజీ మార్కెట్ చైర్మన్ రాజేశ్వరి భీమ్ రెడ్డి, యం యుగంధర్ రెడ్డి , సరస్వతి, కో-ఆపరేటివ్ మాజీ డైరెక్టర్ చక్రగిరివర్ధన్ రెడ్డి , విక్రమ్ సింహరెడ్డి,విహారిక రాజేష్ రెడ్డి, సత్యా రెడ్డి ,మహేశ్వర్ రెడ్డి ,ఎం శ్రీనివాసులు (సర్పంచ్) ఎండి తహర్ (ఉప సర్పంచ్) వహీద్, సీత మొగులన్న జగదీష్ భరత్ భాస్కర్ లక్ష్మణ్ ,రాఘవేందర్ తదితరులు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు.

# ప్రజాపాలన-ప్రగతిప్రణాళికలో వైద్య అరోగ్య సేవలు

## జిల్లా వైద్య,ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కె.లలితదేవి

**రంగారెడ్డి జిల్లా,మార్చి05(ప్రభాత ఉదయం)**



ప్రభుత్వం ప్రతిష్టాత్మకమైన చేపడుతున్న 99రోజుల ప్రజాపాలన-ప్రగతిప్రణాళికలో వైద్య అరోగ్య సేవల ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా 6వ తేది నుండి స్పెషలిస్ట్ వైద్యులచే జిల్లా వ్యాప్తంగా ప్రారంభించడం జరుగుతుందని డిఎంహెచ్ వో కే.లలితాదేవి తెలిపారు.ఈ కార్యక్రమం ఈనెల 6తేదీ నుండి12వ తేదీ వరకు నిర్వహించబడుతుందని, జిల్లాలో మొదటి దశ కార్యక్రమంలో మాతృ ఆరోగ్యం, మహిళా ఆరోగ్యం,శిశు ఆరోగ్యం మరియు వృద్ధుల కోసం చేపట్టడం జరుగుతుంది.ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో స్పెషలిస్ట్ డాక్టర్లచే మహిళలకు,శిశువుల కు,వృద్దులకు పరీక్షలు నిర్వహించి చికిత్స చేస్తారు. కౌమరదశలో ఉన్న వారికి అనీమియా పరిక్ష, పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తారు. ఆర్బిఎస్ కె డాక్టర్ల ఆధ్వర్యంలో రెసిడెన్సియల్ పాఠశాల విధ్యార్థులకు కంటి పరీక్షలు,ఆడపిల్లలకు గైనకాలజిస్ట్,ల చే పరిక్షలు చేసి చికిత్స , సూచనలు అందిస్తారు.వృద్దుల కోసం,వృదాప్య ఆశ్రమాలలో కూడా స్పెషలిస్ట్ వైద్యులచే పరీక్షలు నిర్వహిస్తారు.అదేవిధంగా మోగా హెల్త్ క్యాంప్ మహిళలకు సింధు హస్పిటల్ సౌజన్యంతో జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్,జిల్లా వైద్య,ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కె.లలితదేవి ఆధ్వర్యంలో నిర్వహించబడుతుంది.ఈక్యాంపులో గైనాకాలజి, జనరల్ మెడిసిన్,ఆర్థోపెడిక్,డెర్మటలోజీ అప్తమాలజి, ఈంఎస్.టి., డెంటల్ స్పెషలిస్ట్ వైద్యులు పాల్గోని పరిక్షలు నిర్వహిస్తారని తెలిపారు. ప్రత్యేకంగా మహిళలకు,మామోగ్రామ్ అల్ట్రా సౌండ్,పాప్ స్మియర్,ఈ.సి.జి.,2డిఎకో,ఎక్స్-రే వంటి పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు.ల్యాబ్ ఇన్వెస్టిగేషన్,లు సీబీపీ,ఎల్ఎఫ్టి,ఆర్ఎఫ్టి,థైరాయిడ్ ప్రొఫైల్,హచ్ వి,వీడీఆర్ఎల్ఆర్బీఎస్,లిపిడ్ ప్రొఫైల్& హోబ్లిక్ టెస్టులు తెలంగాణ డయాగ్నోస్టిక్స్ అధ్వర్యంలో నిర్వహిస్తారని తెలిపారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: MEKALA DAMODAR REDDY. "RNI. Title- Code: TELTEL12231**. Cell:9391089608